ప్రజాశక్తి
సోమవారం 19 జూన్ 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

కొండెక్కిన కూరగాయలు

- వేసవి తీవ్రతతో నాణ్యత లేని సరుకు
- మార్కెట్‌లో కొన్ని రకాలు కనుమరుగు
- ధరల నియంత్రణ పట్టని అధికారులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

కూరగాయల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. గత 15 రోజుల్లో ప్రతి వెరైటీ కిలోకు రూ.5 నుంచి రూ.20 వరకు పెరిగాయి. రైతు బజార్లలో ఉన్న ధరలకు మార్కెట్‌లో ఉన్న ధరలకు కిలో రూ.10 నుంచి 20 వరకు తేడా ఉంటోంది. దీంతో ఎక్కువ మంది రైతు బజార్లను ఆశ్రయిస్తున్నారు. కొన్ని రకాల కూరగాయాలు రైతు బజార్లలో కన్పించడం లేదు. సరఫరా తగ్గిందంటున్నారు. అరకొర వసతులతో రైతు బజార్లలో వేసవి తీవ్రతను కూరగాయలు నాణ్యత మరింత తగ్గుతోంది.

వివిధ రైతు బజార్లలో టమోటా కిలో రూ.38కు చేరింది. బహిరంగ మార్కెట్‌లో రూ.50కు అమ్ముతున్నారు. రైతు బజార్లలో ఆదివారం క్యారెట్ ధర రూ.49, పచ్చిమిర్చి రూ.83, కాకర రూ.34, బీర రూ.40, క్లాలిఫ్లవర్ రూ.80, క్యాబేజి రూ.19, దొండ రూ.22, బంగాళదుంపలు రూ.22, గోరుచిక్కుడు రూ.38, ఉల్లిపాయలు రూ.18, దోసకాయ రూ.15, పొట్ల రూ.15, సొర రూ.25, బీట్ రూట్ రూ.34కు విక్రయించారు. బోర్డు ధరల కంటే కొంత మంది వ్యాపారులు కిలోకి రూ.2 నుంచి రూ.5 వరకు అదనంగా విక్రయిస్తున్నా మార్కెటింగ్ శాఖ అధికారులు నియంత్రించడం లేదు. ఆకు

కూరలు కట్ట రూ.15 నుంచి రూ.20 వరకు పలుకుతున్నాయి. రైతు బజార్లలో రైతుల సంఖ్య క్రమంగా తగ్గిపోయి వ్యాపారులసంఖ్య పెరుగుతోంది. రైతు బజార్లలో కిలో దొండ కాయరూ.22కు విక్రయిస్తున్నా నారా కోడూరులో రైతులకు మాత్రం కిలో రూ.10 కూడా దక్కడం లేదు. బెండకాయ కిలో రూ.8, వంకాయలు రూ.8లు మాత్రమే లభిస్తుంది.

కొద్దిమంది రైతులు మాత్రం రైతు బజారుకు వచ్చి విక్రయిస్తున్నారు. అయితే రవాణా ఖర్చులు అధికం కావడం వల్ల పొలం దగ్గర అమ్ముకున్నా రైతు బజారులో అమ్ముకున్నా దక్కేది కూలిపాటేనని వివిధ గ్రామాల నుంచి వచ్చి రైతు బజార్లలో కూరగాయలు విక్రయిస్తున్న రైతులు వాపోతున్నారు. క్యాప్సికమ్, క్యారెట్, బిట్రూట్ తప్ప మిగతా కూరగాయలన్నీ ఎక్కువగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సరఫరా అవుతున్నాయి. గత 40 రోజులుగా వర్షాలు లేకపోవడం, ఎండల తీవ్రత కావడంతో కూరగాయల తోటలు దెబ్బతింటున్నాయి. గతనెలలో కురిసిన అకాల వర్షాల వల్ల కొన్ని ప్రాంతాల్లో కూరగాయల తోటలు దెబ్బతినడంతో ఉత్పత్తి తగ్గి ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. అంతేగాక రవాణా ఖర్చుల భారం

2లో

ఉండవల్లిలో బిల్లు ప్రతులను దహనం చేస్తున్న నాయకులు, స్థానికులు

రూ.488 బిల్లులో ఇతర ఛార్జీలే రూ.197

- విద్యుత్ బిల్లుల పెరుగుదలపై సిపిఎం పరిశీలన
- రెంట్టింపు బిల్లులు వచ్చాయని జనం ఆవేదన
- రూ.87 యూనిట్ల విద్యుత్‌కు రూ.488 బిల్లు
- ఉండవల్లిలో బిల్లు ప్రతులు దహనం

2లో

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించండి

24న రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్

4లో

ర్యాంకులు సాధించిన విద్యార్థులతో భాష్యం చైర్మన్ రామకృష్ణ

జేఈఈలో జిల్లా విద్యార్థుల అత్యుత్తమ ర్యాంకులు

ప్రజాశక్తి-గుంటూరు

జేఈఈ అడ్వాన్స్‌డ్-2023 ఫలితాలలో భాష్యం ఐఐటి జేఈఈ అకాడమీ ఓపెన్ కేటగిరీలో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులతో సంచలనం సృష్టించిందని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ తెలిపారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో భాష్యం ఐఐటి జేఈఈ అకాడమీ విద్యార్థులు ఓపెన్ కేటగిరీలో ఎ.వి.శివరామ్ ఆలిండియా 5వ ర్యాంకు, వై.వి.మణీందర్‌రెడ్డి 10వ ర్యాంకు సాధించి భాష్యంకి గర్వకారణంగా నిలిచారన్నారు. అంతేకాక వివిధ కేటగిరీల్లో వై.వి.మణీందర్‌రెడ్డి ఆలిండియా 1వ ర్యాంకు, కె.లక్ష్మీసూర్య ఆలిండియా 6వ ర్యాంకు, పి.నిశ్చల్‌సుభాష్ ఆలిండియా 7వ ర్యాంకు, ఆర్.అక్షయ్‌కార్తీక్ 8వ ర్యాంకు, ఎం.శ్రీవిఘ్నేష్ ఆలిండియా 21వ ర్యాంకు, వి.దీపేష్ ఆలిండియా 22వ ర్యాంకు, ఎ.మౌర్యనందన్ 28వ ర్యాంకు, ఐ.హర్షిత 29వ ర్యాంకు, పి.చంద్రహాస్ 32వ ర్యాంకు, సిహెచ్.కుందన్‌సాయి 39వ ర్యాంకు వంటి 50లోపు 11 అత్యుత్తమ ర్యాంకులతోపాటు ఆలిండియా 100లోపు 16 ర్యాంకులు, 200లోపు 23 ర్యాంకులు, వెయ్యిలోపు 59 ర్యాంకులు, రెండువేల లోపు 99 ర్యాంకులు, 5వేలలోపు 181 ర్యాంకులు సాధించటంతోపాటు ఐఐటి సెలక్షన్స్‌లో ఆలిండియా ఆల్‌టైం ది బెస్ట్‌గా నిలిచిందన్నారు. అన్ని పోటీ పరీక్షా ఫలితాలలో ఆల్‌రౌండర్స్‌గా నిలుస్తున్న భాష్యం ఐఐటి అకాడమీ విద్యార్థులను చూస్తే గర్వంగా ఉందని, ఈ అద్భుత ఫలితాలను పక్కా ప్రణాళికతో కూడిన మా భాష్యం ఐఐటి ఫౌండేషన్ కరిక్యులమే కారణమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను భాష్యం చైర్మన్ రామకృష్ణ, డైరెక్టర్ హనుమంతరావు, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా భాష్యం విద్యార్థులు నగరంలోని పలు ప్రధాన కూడళ్ల గుండా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

పాఠశాలలు మరోవారం ఒంటిపూటే

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

మండుటెండలు, వేడిగాలుల మధ్య ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు గత సోమవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 12 నుంచి 17 వరకు ఉదయం 7.30 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించాలనే ఆదేశాలతో గతవారం రోజులుగా ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నారు. వేసవి తీవ్రత తగ్గకపోవడం, వడగాల్పుల ప్రభావం వల్ల ఒంటి పూట బడులు మరో వారం పొడిగించాలని ప్రభుత్వం ఆదివారం నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యాశాఖ నుంచి ఆదివారం ఉదయం వరకు సమాచారం రాకపోవడంతో కొన్ని కార్పొరేట్ సంస్థలు మాత్రం యథాతథంగా పాఠశాలలు ఉదయం 8 గంటల నుంచి సా యంత్రం 4.45 వరకు జరుగుతాయని ప్రకటించాయి.

పాల ఉత్పత్తి పెంపుదలే లక్ష్యం

ప్రజాశక్తితో పల్నాడు జిల్లా పశుసంవర్థక శాఖాధికారి కె.కాంతారావు 8 లో

నిరసన తెలియజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఎంఇఒ-1 పోస్టులు యథాతథంగా కొనసాగించాలి

ఫ్యాప్టో ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ఎంఇఒ-1 పోస్టుల్లో పనిచేస్తున్న జెడ్పీకి చెందిన ఉపాధ్యాయులను యథాతథంగా కొనసాగించాలని, ఖాళీగా ఉన్న ఎంఇఒ-1 పోస్టులను ప్రభుత్వ మేనేజ్‌మెంట్ ఉపాధ్యాయులకు ఇవ్వాలని కోరుతూ ఎంఇఒ-2 పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న కౌన్సెలింగ్

2లో

విశాఖ ఉక్కు పరిరక్షణకు

రాజకీయాలకు అతీతంగా పోరాడదాం

- ఉక్కు పరిశ్రమ ఉద్యోగుల యూనియన్ ప్రధాన కార్యదర్శి రామస్వామి
- పల్నాడు జిల్లా కేంద్రంలోలో రౌండ్ టేబుల్ సమావేశం

4లో

బాధిత కుటుంబానికి సహాయాన్ని అందిస్తున్న ప్రజా ప్రతినిధులు

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే చేయూత

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని కంఠంరాజు కొండూరులో శనివారం ఆటో ప్రమాదంలో మరణించిన విద్యార్థి దాసరి తరుణ్ కుటుంబానికి మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రూ.20 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ మొత్తాన్ని బాధి కుటుంబానికి జెడ్‌పిటిఒసి ఎం.అరుణ, యార్డు చైర్మన్ షేక్ బాజీ, సర్పంచ్ ఉన్నం ఝాన్సీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎం.నాగలక్ష్మి, ఎంపిటిసి షేక్ సుభాని, వైసిపి నాయకులు వీరయ్య, తంబిరాజు, వీరవసంతరావు, శేషయ్య పాల్గొన్నారు.

నిత్యావసరాల వితరణ

ప్రజాశక్తి - వినుకొండ

బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో జీవి మాధవరావు ఆఫీస్ నందు 16 నిరుపేద బ్రాహ్మణ కుటుంబ ములకు బియ్యం, నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. హైద్రా బాద్ వాస్తవ్యులు అక్కిరాజు శశికళ, మరికొందరు దాతల సహాయ సహ కారాలతో బియ్యం,నూతన వస్త్రాలు, చీంలు అంద జేశారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందిస్తున్న చింత కుంట శంకర రావు, కుడుముల రామారావు (బొల్లాపల్లి కరణం), శిష్టా శ్రీ శైలమల్లి ఖార్జున శాస్త్రి , అక్కిరాజు శశికళ లకు సన్మానించారు.

కారెంపూడిలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-కారెంపూడి

నిరుపేదల అభ్యున్నతి కోసం వైసిపి ప్రభుత్వం శ్రమిస్తోందని ప్రభుత్వ విప్ మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకష్ణారెడ్డి అన్నారు. ఆదివారం కారంపూడిలో 11వ రోజు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యేకు పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. సర్పంచ్ ప్రమీల భాయ్ తేజ నాయక్, ఎంపీపీ మేకల శారద శ్రీనివాసరెడ్డి జెడ్పిటిసి షేక్ షఫీ పాల్గొన్నారు.

రేకుల షెడ్ మరమ్మతులకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని 27వ వార్డు, కూరగాయల మార్కెట్‌లో ఆకుకూరలు అమ్ముకునే వర్తక సంఘం సభ్యులు ఆకుకూరలు అమ్ముకునే షెడ్ మరమ్మత్తులకు గురి కావడంతో అందుకోసం రూ.15 వేలను టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమకూర్చారు. ఈ మొత్తాన్ని 10 మంది వర్తక సంఘం సభ్యులకు స్థానిక టిడిపి నాయకులు ఆదివారం అందించారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త ఎన్.అబద్దయ్య, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు డి.రాజు, నాయకులు జి.దుర్గారావు, షేక్ రియాజ్, వీరాంజనేయులు, బి.దుర్గారావు, పి.మణికంఠ, కనకమాలిక, అర్జున్‌రావు, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూ.488 బిల్లులో ఇతర ఛార్జీలే రూ.197

- విద్యుత్ బిల్లుల పెరుగుదలపై సిపిఎం పరిశీలన
- రెంట్టింపు బిల్లులు వచ్చాయని జనం ఆవేదన
- రూ.87 యూనిట్ల విద్యుత్‌కు రూ.488 బిల్లు
- ఉండవల్లిలో బిల్లు ప్రతులు దహనం

మంచికలపూడిలో ప్రజలతో మాట్లాడుతున్న పాశం రామారావు తదితరులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

విద్యుత్ బిల్లుల పెరుగుదలపై మండలంలోని మంచికలపూడిలో ప్రజలను సిపిఎం నాయకులు ఆదివారం కలిసి బిల్లులను పరిశీలించారు. బిల్లులు విపరీతంగా పెరిగాయని, గతంకంటే రెట్టింపు వచ్చిందని నాయకుల ఎదుట పలువురు వాపోయారు. ఇంత మొత్తంలో బిల్లుల చెల్లించలేకపోతున్నామని అన్నారు. యేమినేని కోటేశ్వరరావు బిల్లును పరిశీలించగా 87 యూనిట్లు విద్యుత్ వాడుకున్నందుకు రూ.488 బిల్లు వచ్చింది. ఇందులో అసలు బిల్లు రూ.291 కాగా ఇతర ఛార్జీలు 197.48గా ఉంది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ ప్రజలపై ప్రభుత్వం ముప్పేట దాడి చేస్తోందని, విద్యుత్ ఛార్జీల ద్వారా నిలువుదోపిడీకి దిగిందని విమర్శించారు. ట్రూ అప్, సర్దుబాటు, ఎఫ్‌పిపిసిఎ తదితరాల పేరుతో అసలు కొంట ఇతర చార్జీలే అధికంగా వసూలు చేస్తోందని, ఎప్పుడో వాడుకున్న విద్యుత్‌కు ఇప్పుడు ఛార్జీలు ఏమిటని ప్రశ్నించారు. 2014 నుండి 2019 వరకు వినియోగించుకున్న కరెంటుకు ప్రజలు ఆనాడే బిల్లు కట్టేసారని, కానీ ప్రభుత్వం రూ.2,900 కోట్ల లోటంటూ జనం నుండి 36 నెలల పాటు వసూలు చేయడానికి విద్యుత్తు నియంత్రణ మండలి ద్వారా అనుమతి పొందారని తెలిపారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో వాడుకున్న కరెంటుకు కట్టిన బిల్లు చాల్లేదని అదనంగా రూ.3083 కోట్లు ప్రజల వద్ద నుండి వసూలు చేయాలని ఆదేశాలు ఇచ్చారని మండిపడ్డారు. ఈ నెల బిల్లులో 2021లో వాడుకున్న బిల్లు కూడా యూనిట్‌కి 20 పైసలు చొప్పున మళ్లీ వసూలు చేస్తున్నారని తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలను తెచ్చిందని, వాటిని రాష్ట్ర ప్రభుత్వం నిస్సిగ్గుగా అమలు చేయడం వల్లే ఈ బిల్లులు వస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో వ్యవసాయానికి అందించే విద్యుత్తు మొత్తం 30 ఏళ్ల పాటు ఆదాని కంపెనీ సరఫరా చేసేలా ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. బొగ్గు, ఇంధనం ధరలను కార్పొరేట్లు పెంచుకొని కోట్ల రూపాయలు పోగు చేసుకోవడానికి ప్రభుత్వాలు అవకాశం ఇస్తున్నాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్రజలపై భారాలకు వ్యతిరేకంగా వామపక్షాలు చేస్తున్న ఉద్యమాల్లో ప్రజలంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ ఎండలు మండిపోతున్నాయని, కీలకమైన దశలో అప్రకటిత విద్యుత్తు కోతలతో జనం అల్లాడిపోతున్నారని చెప్పారు. మరోవైపు ఈ నెల వచ్చిన కరెంటు బిల్లు చూసి జనానికి షాక్ కొట్టిందని అన్నారు. వీటిని తగ్గించే వరకూ ఉద్యమిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వై.స్టాలిన్, వై.బ్రహ్మేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి, వై.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కరెంటు ఛార్జీలను ఇబ్బడిముబ్బడిగా పెంచి దొంగదెబ్బ తీసిందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.భాస్కరయ్య విమర్శించారు. పెంచిన ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ విద్యుత్ బిల్లులను ఆదివారం రాత్రి ఉండవల్లిలో దహనం చేశారు. భాస్కరయ్య మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల పేరుతో మరో పిడుగు విద్యుత్ వినియోగదారుల నెత్తిపై పడనుందని, కార్పొరేట్ల లాభాల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఈ భారాలు ప్రజలపై వేయనుందని చెప్పారు. మెడీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగిన జగన్ ప్రభుత్వం వంట గ్యాస్ లాగానే ప్రతి నెలా విద్యుత్ చార్జీలు పెంచడానికి సిద్ధమైందని మండిపడ్డారు. సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ 2000 సంవత్సరంలో టిడిపి ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా విద్యుత్ రంగాన్ని మూడు ముక్కలు చేసి సంస్కరణల పేరుతో జనం తిరగబడ్డ సంగతిని గుర్తు చేశారు. ఆ పోరాటం వల్ల తరువాత వచ్చిన వైఎస్ ప్రభుత్వంగానీ మరే ప్రభుత్వంగానీ పది సంవత్సరాల పాటు విద్యుత్ ఛార్జీలు పెంచడానికి సాహసించలేదని చెప్పారు. ఇప్పుడు దొడ్డిదారిన నాడు రాజశేఖరరెడ్డి తిరస్కరించిన విధానాలపై జగన్ అమలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు వి.వెంకటేశ్వరరావు, రామారావు, పార్థసారథి, టి.శివయ్య, ఎం.సాంబశివరావు, ఒ.రమేష్, బి.మస్తాన్‌రావు, కె.వెంకటేశ్వరరావు, ఎస్.రాములు, అరుణ పాల్గొన్నారు.

పెద్ద కోనేరు పునరుద్ధరణ పనులకు ప్రత్యేక కమిటీ

ప్రజాశక్తి - మంగళగిరి

పెదకూనేరు పునరుద్ధరణ పనులకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని దేవా దాయ శాఖ కమిషనర్‌తో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఆవరణలో జరిగిన సమీ క్షలో నిర్ణయించారు. ఆదివారం నిర్వ హించిన సమావేశంలో పలు అంశాలను చర్చించారు. వివిధ శాఖల అధికారులతో కమిటీని ఏర్పాటు చేసి వారి పర్యవేక్షణలో పనులను చేపట్టాల్సి ఉంటుందని, అందుకు నిధునూ కేటాయించాల్సి ఉందని సమా వేశంలో నిర్ణయించారు. దేవాదాయ శాఖ నుండి, దేవస్థానం నుండి మొత్తంగా రూ.కోటిన్నరతో పనులను చేపట్టడానికి నిర్ణయం చేశారు. సీకే బాలికల పాఠశాల స్థలానికి సంబంధించి లీజు గడువు పూర్తి కావడంతో కొంత స్థలాన్ని పార్కింగ్ తీసుకొని, పార్కింగ్ ఇబ్బంది లేకుండా చూడాలని సమావేశం నిర్ణయించింది. సమావేశంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, దేవస్థానం ఈవో ఎ.రామకోటిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం పెద్ద కోనేరును పరిశీలించారు.

ఎంఇఒ-1 పోస్టులు యథాతథంగా కొనసాగించాలి

(మొదటి పేజీ తరువాయి)

సందర్భంగా ఆదివారం డిఇఒ కార్యాలయం వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎం.కళాధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన చర్చలకు భిన్నంగా ఎంఇఒ-2 పోస్టులు నియామకపు జిఒ ఇవ్వటాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇటీవల కాలంలో రాత్రికి, రాత్రి జిఒలు ఇవ్వటం, ఏమాత్రం సమయం ఇవ్వకుండా కౌన్సెలింగ్ నిర్వహించచటం తగదన్నారు. జీవోల్లోని అస్పష్టతలకు కనీసం వివరణ కూడా ఇవ్వకుండా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారని, దీనివల్ల ఉపాధ్యాయులకు నష్టం జరుగుతోందని చెప్పారు. పల్నాడు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ సంపత్ మాట్లాడుతూ విద్యాశాఖ అధికారుల తొందరపాటు నిర్ణయాల వల్ల విద్యారంగానికి తీవ్ర నష్టం జరుగుతుందని చెప్పారు. మెర్జింగ్, ప్లస్-2, ఎంఇఒ-2 పోస్టుల నియామక ప్రక్రియ దీనికి ఉదాహరణన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు కె.బసవలింగారావు, నాయకులు నరసింహారావు, వేళాంగిణిరాజు, జి.మోహన్‌రావు, జి.విజయసారథి, ఎం.శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

కొండెక్కిన కూరగాయలు

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కువగా ఉందంటున్నారు.

పల్నాడు జిల్లా యడ్లపాడు, అమరావతి, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు, గుంటూరు రూరల్, చేబ్రోలు, తాడేపల్లి, మంగళగిరి తదితర ప్రాంతాల్లో కూరగాయల తోటలు ఎక్కువగా ఉన్నాయి. నీటి ఎద్దడి పెరగడం, కాల్వల ద్వారా నీరు రాకపోవడం వల్ల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రైతు బజార్లకు నాణ్యతలేని సరుకు ఎక్కువగా వస్తోంది. జిల్లాలో 30 వేల ఎకరాల్లో కూరగాయల సాగు జరుగుతోంది. రవాణా ఛార్జీలు పెరిగిన నేపథ్యంలో ఒక ప్రాంతంనుంచి మరో ప్రాంతానికి రవాణా చేయడం కష్టంగా ఉందని అందువల్ల ఏ ప్రాంతంలోని వ్యాపారులు ఆ ప్రాంతంలోని ఉత్పత్తి అయిన కూరలు కొంటున్నారు. వివిధ గ్రామాల్లో జరిగే సంతల్లో ధరలు కూడా భారీగానే ఉంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కూడా కూరగాయల ధరలు ఎక్కువగానే ఉంటున్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఉన్న ధరలను తెలుసుకుని గ్రామాల్లో ధరలు పెంచుతున్నారు.

ప్రజాశక్తి
గుంటూరు, పల్నాడు
3
సోమవారం 19 జూన్ 2023

వడదెబ్బతో రైతు మృతి

ప్రజాశక్తి - క్రోసూరు

క్రోసూరు గ్రామానికి చెందిన రైతు మర్రి పాపిరెడ్డి (57) మృతి చెందారు. ఆదివారం ఉదయం 10 గంటలకు గేదెలు తోలుకొని పొలానికి వెళ్ళాడు. తిరిగి వాటిని సాయంత్రం తోలుకొని వచ్చే సమయంలో వడదెబ్బ తగిలి నీరసం రావడంతో అక్కడి కక్కడే కింద పడి పోయాడు. గేదెల వద్ద ఉన్న జనం వచ్చి కింద బడ్డ అతనిని పైకి లేపేందుకు యత్ని స్తుండగా మృతి చెందాడు.ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మర్రి పాపిరెడ్డి

భర్త వేధింపులపై 'దిశ'కు వైద్యురాలు ఫిర్యాదు

వెంటనే స్పందించిన పోలీసులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పని చేసే వైద్యురాలిని భర్త వేధింపులకు గురి చేస్తుండగా ఆమె దిశ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల కథనం ప్రకారం గుంటూరు లోని సీతారామ నగర్‌లో డా.ఉమా దేవి స్థానిక విశ్వా హాస్పిటల్ లో వైద్యురాలిగా పనిచేస్తోంది. తన భర్త ఉపేంద్ర కూడా అదే హాస్పిటలో డాక్టర్ గా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరి మధ్య గత కొంత కాలంగా ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున డా.ఉమా దేవిని భర్త ఉపేంద్ర కొట్టారు. భయంతో బాధితురాలు డాక్టర్ ఉమాదేవి దిశ (ఎస్ఓఎస్)కు తన మొబైల్ ద్వారా కాల్ చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు సంబంధిత ప్రాంతాన్ని గుర్తించి కాల్ చేసిన పది నిముషాల వ్యవధిలో ఉమాదేవి ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు. భార్య ఉమాదేవి పై చేయి చేసుకొని గొడవ పడుతున్న భర్త ఉపేంద్రను పోలీసులు అదుపు చేశారు. ఆర్థిక లావాదేవీల విషయంలో పదేపదే తనతో భర్త గొడవ పడుతున్నట్లు బాధితురాలు పోలీసులకు తెలిపింది. డా.ఉమాదేవి ఇచ్చే ఫిర్యాదు ఆధారంగా భర్త ఉపేంద్ర పై చర్యలు తీసుకుంటామని పాత గుంటూరు పోలీసులు తెలిపారు.

బైక్ దొంగతనం కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి రూరల్ సర్కిల్ పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి నుండి 10 బైకులు స్వాధీనం చేసుకున్నట్లు మంగళగిరి రూరల్ ఎస్సై క్రాంతి కుమార్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు వివరాలను వెల్లడించారు. ఈనెల 14వ తేదీన నవులూరు కు చెందిన మువ్వ వెంకటేశ్వరరావు తన బైక్ పై ఎన్నారై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువుల ను పరామర్శించేందుకు వెళ్లి న క్రమంలో తన బైక్ ను పార్కింగ్ చేసి లోపలికి వెళ్లి బంధువులను పరామర్శించి తిరిగి వచ్చి చూసుకునేసరికి బైక్ దొంగలించబడింద ని గ్రహించి ఆ మేరకు రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా విచారణలో వారు పాత నేరస్తులని ఇదివరకే బైకులు దొంగతనం చేసినట్లుగా గుర్తించడం జరిగింద న్నారు. తాజాగా సుమారు 10 మోటార్ బైకులు దొంగలించినట్లు తేలిందన్నారు. వేరు వేరు చోట్ల దొంగలించిన వాటిని దాచిపెట్టి అమ్ముకోవాలని ప్రయత్నం చేశారని.. ఈ క్రమంలో విచారణలో దొంగలించిన బైకులను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. చినకాకాని, ఆటోనగర్, విజయవాడ చోట్ల సుమారు 10 మోటార్ సైకిళ్లను నిందితుల నుండి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ దొంగతనం కేసులో మంగళగిరి పట్టణం శాలివాహన పేటకు చెందిన ఒంటిపులి ధర్మయ్య, సత్తెనపలికి చెందిన వేముల శ్రీనివాసరావు లను అరెస్టు చేసినట్లు తెలిపారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

మండలపరిధిలోని గ్రామంలో పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేశారు. స్థానిక ఎస్ఐ రవీంద్ర తెలిపిన వివరల ప్రకారం స్పెషల్ బ్రాంచ్ సమాచారం మేరకు మండల పరిధిలోని పెద్దగొట్టిపాడు గ్రామ శివారు లోని ఖాళీ ప్రదేశంలో పేకాట (కోత ముక్క) ఆడుతున్న ఏడుగురు వ్యకు_లను, ప్రత్తిపాడు మండల కేంద్రంలో ఐదు గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. గొట్టిపాడులో అరెస్టు చేసిన వారి వద్ద నుండి రూ.15,010, పేక ముక్కలను, ప్రత్తిపాడులో జూదరుల నుంచి రూ. 2,830, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాట ఆడుతున్న వారిని పట్టుకున్న ఎస్ ఐ రవింద్ర, సిబ్బంది

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

మండలంలోని పమిడివారిపాలెంలో ఆదివారం పేకాట స్థావరంపై పెదనందిపాడు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తన సిబ్బందితో దాడి చేసి నలుగురు పేకాటరాయల ను అరెస్ట్ చేసి వారి వద్ద గల 3300 నగదు సీజ్ చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు.

అనధికార మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-కారెంపూడి

మండల కేంద్రమైన కారెంపూడిలోని మాచర్ల రోడ్డులో ఉన్న ఓ రెస్టారెంట్ లో అనధికార మద్యాన్ని గుంటూరు స్పెషల్ పార్టీ టీమ్ ఆదివారం స్వాధీనం చేసు కున్నారు.స్పెషల్ టీమ్ కు అందిన సమాచారం మేరకు రెస్టారెంట్‌లోనికి వెళ్లి తెలంగాణ,ఆర్మీ మద్యం స్వాధీనం చేసుకొని ఓ వ్యక్తిని అదుపులోనికి తీసుకున్నట్లు తెలుస్తోంది.

పొలం వివాదంలో కుటుంబంపై దాడి

మత్తుకుమల్లి మాజీ సర్పంచ్, పోలీసులపై బాధిత కుటుంబం ఆరోపణలు

ప్రజాశక్తి - వినుకొండ

శావల్యాపురం మండలం మత్తుకుమల్లి గ్రామానికి చెందిన పచ్చవ సూర్యనారాయణ, అతని భార్య, కుటుంబ సభ్యులపై గ్రామ మాజీ సర్పంచ్, వైసీపీ నాయకులు చింతల వెంకటేశ్వర్లు, అతని కుమారులు, వారి వర్గీయులు కలిసి ఆదివారం దాడి చేశారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పొలం వివాదంలో గతంలో కోర్టులో వేసిన కేసును ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో తమ అంతు చూస్తామని బెదిరించారు. కేసు రాజీకి సూర్యనారాయణ కుటుంబం నిరాకరించడంతో దాడి చేసి గాయపరిచారు. ప్రస్తుతం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు.. ఎమ్మెల్సీ ద్వారా ఫిర్యాదు చేసినా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితులు ఆరోపించారు. గతంలో వెంకటేశ్వర్లు వర్గీయులు కోర్టు కేసు రాజీ పడాలంటూ మూడు సార్లు దాడి చేశారని, శావల్యాపురం పోలీ సులకు ఫిర్యాదు చేసినా పట్టనట్టు వ్యవహరించారని ఆరోపించారు. తమపై వెంకటేశ్వర్లు వర్గీయులు చేసిన వరుస దాడులపై ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసు నమోదు చేసి చర్యలు తీసుకోలేదని , పోలీసుల నిర్లక్ష్య వైఖరి, అధికార పార్టీ వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్న తీరు వల్లే తిరిగి దాడి చేశారని ఆరోపించారు. వెంకటేశ్వర్లు, వైసిపి వర్గీయలతో తమ కుటుంబానికి ప్రాణ హాని ఉందని, పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తమ కుటుంబానికి రక్షణ కల్పించి న్యాయం చేయాలని వారు కోరారు. బాధిత కుటుంబ సభ్యుల నుండి ఫిర్యాదు అందిందని విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్సై గల్లా రవికుమార్ తెలిపారు.

దాడిలో గాయపడ్డ పచ్చవ సూర్యనారాయణ, భార్య

తల్లీకొడుకు అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

ఈ నెల 15 నుండి మండలంలోని గోగులమూడిలో తల్లీకొడుకు అదృశ్య మయ్యారు. తల్లి లావణ్య(27), కొడుకు తేజ స్విన్ (5) తమ ఇంటి నుండి అదృశ్యమైనట్టు ఆమె భర్త నాగ ప్రవీణ్ పెదనందిపాడు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు.

చెక్కును అందజేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - దుర్గి

మాచర్ల నియోజకవర్గం దుర్గి మండలం నెహ్రూ నగర్ తండా గ్రామానికి చెందిన జటావత్ బాలు నాయక్ అనారోగ్యంతో బాధపడ ు తున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఇటీవల ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి క్రోసూరు పర్యటనలో ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో పల్నాడు జిల్లా కలెక్టర్ ద్వారా వైద్యం ఖర్చుల కోసం రూ.1,00,000 చెక్కును ఆయనకు ఎమ్మెల్యే ఆదివారం అందజేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత

ప్రజాశక్తి-నూజెండ్ల

మండలంలోని తెల్లపాడు గ్రామ పంచాయతిలోని టి అన్నవరంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మూడు పూరిళ్లు దగ్ధమైన ఘటనలో బాధితులకు శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. బాధితులకు బియ్యం, వంట సామాగ్రి, బట్టలను గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు అంద జేశారు. ఈ సందర్భంగా జీవి ఆంజనేయులు మాట్లాడుతూ అగ్ని ప్రమాద బాధితులకు తాము అండగా ఉంటామని చెప్పారు.ప్రభుత్వం త్వరితగతిన బాధితులకు ఇళ్లు మం జూరు చేసి వారికి ఆర్థిక సాయం చేయాలని లేనిపక్షంలో బాధితుల తరపున పోరాడ తామని అన్నారు.

ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మండల పరిధిలో గోపాలవారి పా లెం గ్రామానికి చెందిన యంపరాల అంకమ్మ ప్రమాదవశాత్తు గాయలు కావడంతో పట్టణం లోని ఒక ప్రైవేట్ హాస్పటల్ నందు చికిత్స పొందుతూ ఉండగా విషయం తెలుసుకొని మాజీ మంత్రివర్యులు ప్రత్తిపాటి పుల్లారావు అక్కడికి విచ్చేసి వారికి ధైర్యం చెప్పి పరామర్శించారు. అనంతరం అంకమ్మకి రూ.10,000ను ప్రత్తిపా టి ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో చిలకలూరిపేట రూరల్ మండలం అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్, పార్టీ సీనియర్ నాయకులు చిన్నం రవి, గ్రామ అధ్యక్షులు గోపాలం, సాగర్, మందపాటి చిన్నబ్బాయి ,గోపాలం శ్రీధర్ రావు, గోరంట్ల అనమయ్య పలువురు విచ్చేశారు.

వృద్ధుడిపై వాలంటీర్ దాడి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

కుటుంబ గొడవల నేపథ్యంలో వద్దుడిపై వాలంటీర్ దాడి చేసిన ఘటన మండల కేంద్ర మైనా ముప్పాళ్లలో శనివారం రాత్రి చోటుచేసుకుంది.బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సయ్యద్ నాగుల్ మీరా తన మనవడిని ఇంట్లో తిడుతుండగా తమనే ఉద్దేశ పూర్వకంగా తిడుతున్నాడనే అపోహతో నాగుల్ మీరా ఇంటి పక్కనే నివసిస్తున్న వాలంటీర్ పఠాన్ జిలాని అతని కుటుంబ సభ్యులు నాగుల్ మీరా పై దాడి చేశారు. ఆ సమయంలో నాగుల్ మీరా తలకు తీవ్ర గాయామవ్వడంతో క్షతగాత్రుడిని అతని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.బాధితుడి కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల పట్టణం, పట్టణానికి సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒక మహిళకు ,మరొక యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. వారికి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఒకరిని గుంటూరుకు, మరొకరిని నరసరావుపేటకు తరలించారు మాచర్లనుండి జమ్మలమడక వైపు ద్విచక్ర వాహనంపైవెళుతున్న యువకుడని బొంబాయి కంపెనీ ఫ్రిడ్జి సమీపంలో మాచర్ల వైపు వస్తున్న ఆటో, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై ఉన్న ఎస్.నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. కాలు విరిగిపోయింది. పట్టణంలోని పాత కూరగాయల మార్కెట్ వద్ద ద్విచక్ర వాహనంపై వస్తున్న భార్యాభర్తలను మరొక వాహనం ఢీ కొనడంతో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. భార్య జి.అంజమ్మకు తలకు బలమైన గాయమైంది. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లేమల్లెలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-అమరావతి

అమరావతి మండల పరిధిలోని లేమల్లె గ్రామంలో వట్టికుంట చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. వడ్లమూడి హాస్పిటల్, అమరావతి సహకారంతో లేమల్లెలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ప్రతి పల్లెను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలన్న ఏకైక లక్ష్యంతో వట్టికుంట చారిటబుల్ ట్రస్ట్ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తోందని వ్యవస్థాపక అధ్యక్షులు వట్టికుంట. శేషగిరిరావు (శేషన్న) అన్నారు. డాక్టర్ వడ్లమూడి. శ్రీనివాసరావు సుమారు 250 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించారు.

ఇక్కుర్రులో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-నరసరావుపేట

రైతులు, నాయకుల సహకారంతో నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు పల్నాడు జిల్లాలోని గ్రామాల్లోని పొలాలు, డొంక రోడ్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా మండలంలోని ఇక్కుర్రులో కాలవ కట్ట సుమారు 10 కిలోమీటర్లు మేరకు అభివృద్ధి జరుగుతోంది. దీని ద్వారా రైతులకు, ప్రజలకు రాకపోకలకు వీలు కలుగుతుంది.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న లక్ష్మీశ్వరరెడ్డి తదితరులు

1, 2 తేదీల్లో ప్రాంతీయ శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జూలై 1, 2 తేదీలలో యడ్లపాడులో జరగనున్న ప్రాంతీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వర రెడ్డి పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక పండరీప రంలోని ఏలూరు సిద్దయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ శిక్షణా తరగతులకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి నాయకత్వంలో ఉన్న కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల వ్యవసాయ విధానాల వల్ల వ్యవసాయం నానాటికి సంక్షోభంలో కూరుకుపోతోందని, రోజురోజుకి పంటలకు పెట్టుబడులు పెరిగిపోతున్నాయన్నారు. రైతులు అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్నారని, మరోవైపు దానికి తగ్గ మద్ద తు ధరలు లేక, వ్యవసాయం దండగ అని వ్యవసాయ దారుల చేతనే అనిపించి, ఉన్న వ్యవసాయాన్ని కూడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టాలని, రైతు కూలీలను వ్యవ సాయ రంగం నుంచి తరిమేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుస్తోందని ఆరోపించారు. కర్ణాటకలో ఒక రాజ కీయ పార్టీ.. వ్యవసాయం చేసే రైతు యువకుడిని పెళ్లి చేసుకునే ఆడబిడ్డలకు రెండు లక్షల రూపాయలు ఇస్తా మని ఎన్నికల వాగ్దానం చేసిన విషయాన్ని ప్రస్తావించారు. వ్యవసాయం చేసే రైతు యువకులను పెళ్లి చేసుకోవడానికి ఆడబిడ్డల తల్లిదండ్రులు ముందుకు రావడం లేదంటే వ్యవ సాయం ఏ స్థితికి చేరిందో అర్థ మవుతుందన్నారు. సాగు చేసే వ్యవసాయదారుల చేతిలో భూమి లేకుం డా పరా యీకరణ అయిపోతోందని, ఒకవైపు పంటలకు గిట్టు బాటు కాక భూమి పడావు పడుతోందని, మరోవైపు వ్యవ సాయంలో తగినంత ఉపాధి లేక వ్యవసాయ కూలీలు రక రకాల వృత్తులు చేస్తూ, వ్యవసాయేతర కార్మికులుగా జీవనం సాగిస్తూ, వలస కార్మికులుగా పట్టణాలకు, దూర ప్రాంతాలకు పోతున్నారని,అక్కడ ఎలాంటి భద్రతా లేని జీవితాన్ని గడుపుతున్నారని చెప్పారు. ఇలాంటి పరి ణామాలకు కారణమేమిటి? ప్రభుత్వ విధానాలు వ్యవ సాయ సంక్షోభాన్ని ఏ విధంగా పెంచి పోషిస్తున్నాయి? అనే విషయాలపై కార్యకర్తలకు అవగాహన కలిగిం చేందుకు ఈ శిక్షణ శిబిరం జరుగుతుందని అన్నారు. మోడీ కార్పొరేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా వ్యవ సాయాన్ని రక్షించడం కోసం ఇటీవల ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగిన కిసాన్ ర్యాలీకి తమ సంఘం వేలాది మంది వ్యవ సాయ కార్మికులను సమీకరించిందని, ఉపాధి హామీ పథ కం రక్షణ కోసం మన రాష్ట్రంలో అన్ని జిల్లాల కలెక్టరేట్ల దగ్గర వేలాదిమంది వ్యవ సాయ కార్మికులతో ధర్నాల నిర్వ హించిందని, భూమి పరాయీకరణకు వ్యతిరేకంగా, సాగు దార్లకు ఉన్న భూహక్కులను కాపాడటానికి, మిగులు భూములు,బంజరు భూముల పంపకానికి పెద్ద ఎత్తున భూ పోరాటాలను నిర్వహిస్తున్నదని తెలిపారు. ఇలాంటి ఉద్యమాలలో కార్యకర్తలుగా ముందుకు వస్తున్న యువతకు అవగాహన, నైపుణ్యాలను పెంచడానికి ఈ శిక్షణ శిబిరం తోడ్పడుతుందని అన్నారు.

బాలుర వసతి గృహంలో దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి -రెంటచింతల

స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో 3 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలుర విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వార్డెన్ బేగ్ తెలిపారు. ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు వివరాలకు సెల్ నెంబర్ 9550067786 సంప్రదించాలని సూచించారు.

'విశాఖ ఉక్కు' పరిరక్షణకు రాజకీయాలకు అతీతంగా పోరాడదాం

- ఉక్కు పరిశ్రమ ఉద్యోగుల యూనియన్ ప్రధాన కార్యదర్శి రామస్వామి
- పల్నాడు జిల్లా కేంద్రంలోలో రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - నరసరావుపేట

సమావేశంలో పాల్గొన్న అఖిలపక్షం నాయకులు

'విశాఖ ఉక్కు..ఆంధ్రుల హక్కు' 'అమ్మేదెవరు కొనేదేవరు' అంటూ అఖిల పక్ష నాయకులు నినాదాలు చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అఖిల పక్ష నాయకుల ఆధ్వర్యంలో స్థానిక పల్నాడు రోడ్డులోని జివిఆర్ గ్రాండ్ హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు అధ్యక్షత వహించారు. రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉక్కు పరిశ్రమ ఉద్యోగుల యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి రామస్వామి మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం కాకుండా రాష్ట్ర ప్రజల సహకారంతో ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్తామని, దీనికి రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఉద్యోగులు, కార్మికులు, మేధావులు, రైతులు ప్రజల సహకారం కావాలని విజ్ఞప్తి చేశారు. ఉక్కు పరిశ్రమను అమ్మేందుకు ప్రధాని మోడీ చేస్తున్న కుటిల ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు రాజకీయ పార్టీలే కాకుండా ప్రతి ఒక్క ఆంధ్రుడు ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. ఉక్కు పరిశ్రమ అమ్మకంపై మోడీ మాట్లాడిన రోజునుండి నేటి వరకు ఉక్కు పరిశ్రమ ఉద్యోగులు కార్మికులు, నిర్వాసితులు పోరాట కమిటిగా ఏర్పడి 857 రోజులుగా పోరాటం చేస్తున్నామన్నారు. ఉక్కు పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వ పెట్టుబడి రూ.4859 కోట్లు కాగా కార్మికుల కృషితో నేడు రూ.3 లక్షల కోట్లకు చేరిందన్నారు. ఉక్కు తయారీ సామర్థ్యం పెంచడం వలన కొత్తగా 10 వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు వచ్చాయన్నారు. రాష్ట్ర ప్రజల ప్రాణ త్యాగంతో ఏర్పడిన ఉక్కు పరిశ్రమ అమ్మనీయబోమని అన్నారు. ఉక్కు పరిశ్రమ అమ్మకానికి వ్యతిరేకంగా ఇప్పటివరకు ఉద్యమాలు, నిరసనలు చేసిన ప్రజా సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉక్కు పరిశ్రమ కార్మిక యూనియన్ ఎఐటియుసి అధ్యక్షులు జె.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అతి పెద్ద పరిశ్రమ ఏడాదికి రూ.6 వేల కోట్లకు పైగా ఆర్థిక లోటును పూడుస్తుందన్నారు.ఉక్కు పరిశ్రమ ప్రభుత్వం రంగంలో కొనసాగిస్తామని ప్రకటించే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. రానున్న పార్లమెంట్ సమావేశాలలో ఉక్కు పరిశ్రమపై ప్రకటించాలని డిమాండ్ చేశారు.

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, సిపిఎం పల్నాడు జిల్లా కార్య దర్శి గుంటూరు విజయ్ కుమార్ మాట్లాడుతూ బిజెపి దాని మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్, భారతదేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేందుకు కుట్రలు చేస్తున్నాయని, ప్రభుత్వం రంగం అనగానే దాని ముద్దు పేరు 'బుక్ వాల్యూ'అన్నట్లుగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ నియంత పోకడలను వామపక్షాలు కూట మిగా ఏర్పడి ఎదుర్కొంటామని హెచ్చరించారు.ఆంధ్ర రాష్టంలోని ప్రధాన రాజకీయ పార్టీలు ఏ మాటలు చెప్పినా ఆచరణలో మాత్రం మోడీ ప్రభుత్వానికి మద్దతుగా ఉంటున్నాయని విమర్శించారు. ప్రత్యక్షంగా టిడిపి, జనసేన, పరోక్షంగా వైసిపిలు పొత్తుల కోసం వెంపర్లాడుతున్నాయని ఎద్దేవా చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన వారు కూడా విశాఖ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు చేసిన పోరాటంలో ప్రాణాలు అర్పించారన్నారు. ప్రభుత్వ రంగం అంటే ప్రజల ఆస్థి అని ప్రతి ఒక్కరూ గ్రహించి మరో రైతాంగ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఆనాడు కమ్యూనిస్టులు, యువజన సంఘాలు పక్క రాష్ట్రాలకు తరలి వెళ్ళుతున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని, ఎపిలో నిర్మించేందుకు ఎన్నో పోరాటాలు చేయాల్సి వచ్చిందని యువకుల ఆత్మ బలిదానాలు, వామ పక్షాలు, ఇండిపెండెంట్ శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యుల రాజీనామాలు చేశారని గుర్తుచేశారు. ఎలాంటి స్వాతంత్ర్య ఉద్యమ చరిత్ర, పరిశ్రమ సాధనలో బిజెపి, నరేంద్ర మోడీల కనీస చేయూతలేదన్నారు. సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ కార్పొరేట్ శక్తుల అనుకూల వర్గాలు బిజెపి పెద్దల చేతిలో అత్యంత దారుణంగా ప్రజల ఆస్తి విశాఖ ఉక్కును బలి చేయడానికి రాష్ట్ర ప్రజానీకం ఒప్పుకునే పరిస్థితి లేదన్నారు. దీనిని ప్రజలు తీవ్రంగా పరిగణలో తీసుకోవాలని ఈ రాష్ట్రంలో బిజెపి కుయుక్తులు సాగకుండా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. 2023 సెప్టెంబర్ నాటికి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ రద్దు చేయాలని, ఈ పోరాటానికి అన్ని తరగతుల ప్రజల మద్దతు కూడగట్టాలని ప్రజా బ్యాలెట్ నిర్వహించాలని నియోజకవర్గ మండల గ్రామస్థాయి కేంద్రాలలో విస్తతంగా ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశం తీర్మానించింది.

సమావేశంలో సీనియర్ న్యాయవాది సిహెచ్. ప్రతాప్, కాంగ్రెస్ నాయకులు ఆర్కే నాయుడు, జై భీమ్ భారత్ పార్టీ జిల్లా నాయకులు గోదా జాన్ పాల్, ఎంఐఎం పార్టీ నాయకులు మస్తాన్వలి, మహిళా సంఘం నాయకులు చెరుకుపల్లి నిర్మల, నాగమ్మ, సిపిఐ సిపిఎం ప్రజా సంఘాల నాయకులు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము, అధ్యక్షులు తాళ్లూరు బాబురావు, రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి బాలకష్ణ, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు, సిఐటియు నాయకులు మస్తాన్ రెడ్డి, ఎఐటియుసి నాయకులు బూదాల శ్రీనివాసరావు, ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్, ఎఐవైఫ్ యువజన సంఘం నాయకులు రాజేంద్ర, షేక్ సుభాని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ నాయకులు శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ఆంజనేయులు నాయక్, ఎల్ఐసి ఉద్యోగులు గౌసు, హుస్సేన్, వాగ్య నాయక్, ఆనంద్, సాయి, మహేష్ పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించండి

- 24న రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం
- సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 24వ తేదీన అన్ని రాజకీయ పార్టీలతో ప్రజాసంఘాల వారితో జరిగే రౌండ్ టేబుల్ సమావేశం జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పుతుంబాక భవన్‌లో జరిగిన సిపిఎం సత్తెనపల్లి పట్టణ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి షేక్ మస్తాన్ వలి అధ్యక్షత వహించారు. చలమయ్య తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ గత అసెంబ్లీ ఎన్నికల్లో విద్యుత్ ఛార్జీలను పెంచబోమని తగ్గిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తాను అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారాలను మోపిరని ఆయన విమర్శించారు. కరెంటు యూనిట్ల రేటు సర్దుబాటు చార్జీలు, విద్యుత్ సుంకం, ట్రూ ఆఫ్ చార్జీలు ఇలా అనేక విధాలుగా విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పటికే అతి తక్కువ ఆదాయాలతో జీవితాలను గడుపుతున్న అనేకమంది పేదలకు చెత్త పన్ను , ఆస్తి పన్ను,పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల తో సతమతమవుతున్న ఈ నేపథ్యంలో విద్యుత్ ఛార్జీలు మరింత పెనుభారంగా మారాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీన అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, వ్యాపార సంస్థల వారితో స్థానిక పుతుంబాక భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని ఈ సమావేశానికి ఆయా పార్టీల, ప్రజాసంఘాల బాధ్యులు పాల్గొని జయప్రదం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఎం సత్తెనపల్లి పట్టణ కమిటీ సభ్యులు కట్టా శివ దుర్గారావు, అనుముల వీంబ్రహ్మం, ఎం.హరిపోతురాజు,పంతంగి ప్రభాకర్,గద్దె ఉమాశ్రీ, జడ రాజకుమార్,రొంపిచర్ల పురుషోత్తం, మామిడి జగన్నాధరావు లు పాల్గొన్నారు.

సత్తెనపల్లి పట్టణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య

బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఈనెల 29 నుండి వచ్చేనెల 2వతేదీ వరకు నూజివీడులో జరిగే 8వ రాష్ట్రస్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే గుంటూరు జిల్లా బాల,బాలిక జట్లను ఆదివారం ఎంపిక చేశారు. పోలీస్ పరేట్ గ్రౌండ్లో నిర్వహించిన ఎంపికల్లో 35 మంది బాలికలు, 48 మంది బాలురు పాల్గొనగా 16 మంది బాలికలు, 16 మంది బాలురులను ఎంపిక చేశారు. తుడిజట్టులో 12 బాలికలు, 12 బాలురు ఉంటారని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు విజయలక్ష్మి తెలిపారు. ఎంపికలను అధ్యక్షులు రేవతి, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

బహిరంగ చర్చకు సిద్ధమా?

రూ.500 కోట్ల అవినీతి ఆరోపణలపై కన్నా లక్ష్మీనారాయణకు జిడిసిసిబి చైర్మన్ సవాల్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

కాంగ్రెస్ పార్టీ హయాంలో మంత్రిగా పనిచేసిన కన్నా లక్ష్మీనారాయణ పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని డిసిసిబి చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు ఆరోపించారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 45 గజాల ఇంటి స్థలంతో రాజకీయం ప్రారంభించిన కన్నా ఇప్పుడు ఎన్ని వేల కోట్లు అర్జించారని ప్రశ్నించారు. సహకార సంఘాల్లో అవినీతి అటూ ఆరోపణ చేసిన లక్ష్మీనారాయణ అందుకు తగిన ఆధారాలు చూపాలన్నారు. లేదంటే రాజకీయాల నుంచి తప్పుకోవాలని సవాల్ చేశారు. గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో రూ.500 కోట్ల మేర అవినీతి జరిగిందని ఆరోపిస్తూ మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ సీబీఐకి లేఖ రాయడంపై మండిపడ్డారు. పూటకో పార్టీ మారే కన్నా లక్ష్మీనారాయణకు బట్ట కాల్చి మొహాన వేయడం మొదటి నుంచి అలవాటే అని అన్నారు. తమ బ్యాంకు పరిధిలో నకిలీ పాస్ పుస్తకాలతో రూ.13 కోట్ల సొమ్ము స్వాహా జరిగిన మాట నిజమేననీ, టిడిపి హయాంలోనే కాక తమ హయాంలో జరిగిన వాటిపైనా విచారణకు సిద్ధమనీ చెప్పారు. తమ బ్యాంకులో జరిగిన అవినీతి గుట్టును తామే స్వయంగా వెలికి తీసి అందుకు బాధ్యులైన వారిపై నిజాయితీగా చర్యలు చేపట్టిన ప్రభుత్వం మాది అని అన్నారు.

వచ్చే ఎన్నికల్లో మంగళగిరి నుండి పోటీ

ప్రజాశక్తి - మంగళగిరి

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుండి జనసేన పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు చర్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మంగళగిరి నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ జనసేన కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి ఎం.వెంకట మారుతిరావు అధ్యక్ష వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ మంగళగిరి కార్పొరేషన్‌లో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళగిరి - తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ కమిటీ ఏర్పాటుకు సమన్వయకర్తలను టి.కొండలరావు, జెవి సాంబశివరావు, డి.శివనాగేంద్రం, బి.కోమలీని నియమించారు.

సమావేశంలో మాట్లాడుతున్న దుడ్డు ప్రభాకర్

వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్‌పేటలోని ఆర్యసమాజంలో కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ అధ్యక్షతన ఎస్టీ రిజర్వేషన్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. కమిటీ కన్వీనర్ దుడ్డు ప్రభాకర్ మాట్లాడుతూ వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చటం లోకూర్ కమిటీ ప్రమాణాలకు విరుద్ధమని తెలిసినా జగన్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయటం శోచనీయమన్నారు. ఎపిలో 33 కులాలకు చెందిన గిరిజన జనాభా 27.39 లక్షలైతే, వాల్మీకి బోయలు కలిస్తే 47 లక్షలకు పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గోండు, కోయ, కోలం, తోటి చెంచు తదితర ఆదివాసీ తెగలు, లంబాడా, ఎరుకల యానాది లాంటి మైదాన ప్రాంత గిరిజన కులాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని, ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న బాక్సైట్ నిక్షేపాలను కొల్లగొట్టే కుట్ర దాగి ఉందని అన్నారు. సమావేశంలో కమిటీ కన్వీనర్లు చంద్రశేఖర్, కోటా నాయక్, ఎన్.నీలాంబరం, వై.వెంకటేశ్వరరావు, పోతురాజు పాల్గొన్నారు.

తొలితరం కమ్యూనిస్టు నెలకుదిటి నాగేశ్వరరావుకు ఘన నివాళులు

ప్రజాశక్తి - తుళ్లూరు

నాగేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎం.రవి, వెంకటేశ్వరరావు

రాజధాని అమరావతిలో కేంద్ర ప్రభుత్వ సంస్థలకు కేటాయించిన స్థలాల్లో ఇప్పటివరకు నిర్మాణాలు ఎందుకు చేపట్టలేదని సిపిఎం ప్రశ్నించింది. రాజధాని నిర్మాణానికి రైతులు ఇచ్చిన భూముల్లో 24 కేంద్ర ప్రభుత్వ సంస్థలకు 208 ఎకరాలు, 18 ప్రభుత్వ రంగ శాఖలకు 27 ఎకరాలను టిడిపి ప్రభుత్వ హయాంలో స్థలాలను కేటాయించడం జరిగిందని, ఇప్పటివరకు నిర్మాణాలు ఎందుకు చేపట్టలేదో బిజెపి నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేసింది. తుళ్లూరు ప్రాంతంలో తొలితరం కమ్యూనిస్టు నాయకులు అమరజీవి నెలకుదుటి నాగేశ్వరరావు 78వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన స్వగ్రామం దొండపాడులో శనివారం రాత్రి వర్ధంతి సభ నిర్వహించారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రవి మాట్లాడుతూ నెలకుదిటి నాగేశ్వరరావు జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని చెప్పారు. గుంటూరు తాలూకా రైతు సంఘం అధ్యక్షుడిగా, టుబాకో బోర్డు మార్కెటింగ్ కమిటీ సభ్యుడిగా, తాలూకా ప్రజా ఆహార కమిటీకి కార్యదర్శిగా అనేక బాధ్యతలు నిర్వహించిన ఆదర్శ కమ్యూనిస్టు నాగేశ్వరరావని కొనియాడారు. జాతీయ ఉద్యమంలో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా నిలిచి ఆరు నెలలు కఠిన కారాగార శిక్ష అనుభవించారని, గుంటూరు జిల్లాలో ఎనలేని గౌరవం పొందిన కమ్యూనిస్టు నేతని శ్లాఘించారు. నిద్రాహారాలు మాని ఊరూరూ తిరిగి యువజనలను, రైతులను,రైతు కూలీలను సంఘటితం చేశారని, అస్పృశ్యతను ప్రతిఘటించారని తెలిపారు. తనకున్న నాలుగెకరాల పొలాన్ని పార్టీకే ఇచ్చారని కొనియాడారు. తుది శ్వాసవిడిచే ముందు తన కుటుంబ సభ్యులందరినీ పిలిపించుకొని తన చేతిలో చేయి వేయించుకొని కమ్యూనిస్టు పార్టీకి అండగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించుకున్నారని తెలిపారు. ఆయన ఆశయాల సాధనకు పునరంకితం అవుదామన్నారు. అనంతరం రాజకీయాలపై మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి తోడు దొంగల్లా వ్యవహరిస్తూ ప్రజలపై మోయలేని భారాలు మోపుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతి విషయంలో బిజెపి కేంద్ర, రాష్ట్ర నాయకులు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తూ మోసపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కేంద్రంలో బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఇప్పటివరకు రాజధాని అమరావతికి నిధులు కేటాయించకుండా మొండి చెయ్యి చూపిందన్నారు. రాజధానిలో కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో నిర్మాణాలు చేపట్టకుండా ఎవరైనా అడ్డుకున్నారా..? అని నిలదీశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, పోలవరం లాంటి ప్రజాపయోగ ప్రాజెక్ట్ లను నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. తొలుత స్మారక స్తూపం వద్ద సిపిఎం జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.భాగ్యరాజు, వి.వెంకటేశ్వరరావు, ఎం.గిరిజ, ఎన్.వెంకటేశ్వరరావు, కె.రామారావు, ఎం.హరిబాబు, ఎన్.శ్రీనివాసరావు, జి.బుల్లిబాబు, బి.వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, ఎన్.గోపాలరావు, కె.ఆంజనేయులు, ఎన్.శ్రీరామమూర్తి, జానీ, రాములు, కృష్ణారావు, పి.వెంకటేష్, జి.లోకయ్య పాల్గొన్నారు.

సేంద్రీయ సాగుపై అవగాహన

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

సేంద్రీయ సాగు, అండ్ మార్కెటింగ్ అనే అంశంపై, అభయ ఎడ్యుకేషనల్ సొసైటీ, కుంచనపల్లి రైతుల ఆధ్వర్యంలో కుంచనపల్లిలో ఆదివారం రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. వ్యవసాయ ఉత్పత్తులపై, మంచి దిగుబడి సాధించేందుకు, తక్కువ ఖర్చుతో వ్యవసాయ పద్ధతులను అభయ ఫౌండేషన్ నిర్వాహకులు వివరించారు. రైతులందరూ గ్రూపుగా ఏర్పడి లాభసాటి వ్యవసాయం ద్వారా ఉత్పత్తి చేసిన వాటిని మార్కెటింగ్ చేసుకునే పద్ధతులను చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బాల శంకర్, రైతు భరోసా కేంద్రం విహెచ్ఎ వి.శిరీష, అభయ ఫౌండేషన్ అధ్యక్షులు జానకిదేవి, బయోటెక్నాలజీ అండ్ జున్న సోలార్ ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి, శ్రేష్ట ఎఫ్‌పిసి డైరెక్టర్ సాంబిరెడ్డి, రైతు నాయకులు ఎ.రంగారావు, రైతులు ఎ.శ్రీనివాసరావు, ఎ.శ్రీను, భాస్కరరావు పాల్గొన్నారు.

జీతాలు పెంచకుంటే ఎప్పుడైనా సమ్మె

నీకో ఆగ్రో ఆయిల్ కంపెనీ యాజమాన్యానికి సిఐటియు అల్టిమేటం

ప్రజాశక్తి - మేడికొండూరు

నిక్ ఆగ్రో ఆయిల్ కంపెనీ వర్కర్స్ జీతాలు పెంచకుంటే సమ్మె తప్పదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. ఆదివారం పేరేచర్ల సెంటర్‌లో కె.సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన కంపెనీ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. నేతాజి మాట్లాడుతూ కార్మికుల జీతాలు పెంచాలని సమ్మె నోటీసు ఇస్తే సమస్యలు పరిష్కరించకుండా, యూనియన్‌తో చర్చించకుండా మొండివైఖరి ప్రదర్శించడం సరికాదన్నారు. సమస్యలు పరిష్కారం కోసం చర్చలు జరగ కపోతే ఈనెల 26వ తారీకు తర్వాత ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్ళటానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. అప్పటి వరకూ దశలవారీ ఆందోళనపై పలు నిర్ణయాలు చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారా యణ, నాయకులు బి.రామకృష్ణ, బి.లక్ష్మణరావు, ఎస్ఎం బాషా, వెంకటేష్, శ్రీకాంత్, మీర్సా, ఖాసిం, గోపి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ఈనెల 25న ఈ-శ్రమ్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-తెనాలి : వివిధ రంగాల్లోని కార్మికులకు ఈ-శ్రమ్ కార్డులను 25న పంపిణీ చేస్తామని కార్మిక శాఖ ఉప కమిషనర్ డి.వెంకటశివప్రసాద్ చెప్పారు. స్థానిక మాఏపి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు సామాజిక భద్రత కల్పించే ఈ-శ్రమ్ కార్డుల పంపిణీ రత్నాఫార్చ్యున్ కళ్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమవు తుందన్నారు. 59 ఏళ్లలోపున్న, పిఎఫ్ సౌకర్యంలేని అసంఘటిత రంగ కార్మికులు అర్హులన్నారు. ఆధార్, బ్యాంక్ ఖాతా జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలతో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలు క్యాంపులో తెలియజేస్తామన్నారు. సమావేశంలో మా ఏపి వ్యవస్థాపకులు దిలీప్‌రాజా, మిలటరీ ప్రసాద్, ఆలియా, ధనలక్ష్మి, అమీర్ చౌదరి, రఫి, అరుణకుమారి పాల్గొన్నారు.

నాగార్జున కొండలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండ ను ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శించారు. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండ కు నాగసిరి, శాంతి సిరి లాంచీ లలో కొండకు వెళ్లిన పర్యాటకులు అక్కడ మ్యూజియంలో ఉన్న బుద్దిని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్తూపం, అశ్వమేధ శాల, స్నానాలగటును సందర్శించారు. అనంతరం అనుపు లోని యాంపి స్టేడియం, అశ్వమేధ యగ్నశాల, శ్రీ రంగ నాథస్వామి దేవాలయం, తదనంతరం 60 అడుగుల ఎత్తునుండి జాలువారే ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు.ఆదివారం లాంచీల ద్వారా పర్యాటక శాఖ కు ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనవిజ్ఞాన వేదిక సభ్యులు

జనవిజ్ఞాన వేదిక పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో చిలక లూరిపేట డివిజన్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదుకు సంబం ధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కోశాధికారి ఎవి శివయ్య మాట్లాడుతూ ప్రజలకు శాస్త్రీయ దృక్పథం కలిగిస్తున్న, మూఢ విశ్వాసాల నుండి జాగృతం చేస్తున్న జనవిజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరెడ్డి,జిల్లా అధ్య క్షులు డి.బుజ్జి బాబు, గౌరవాధ్యక్షులు సిహెచ్ విన్సెంట్ పాల్, డివిజన్ కోశా ధికారి ఎ.గురులింగం, సభ్యులు కె.కోటే శ్వరరావు, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు పక్కా ఇళ్లు

ప్రజాశక్తి-అచ్చంపేట

అచ్చంపేట మండలంలోని పెదపాలెం గ్రామంలో ప్రమాద బాధితులకు స్నేహహస్తాలు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆరు బాధిత కుటుంబాలకు పక్కా గృహాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం గది, హాలు ఉండే విధంగా పనులు ప్రారంభించారు. స్నేహహస్తాలు చైర్మన్ ఎన్నారై ఎంవి రావు బాధిత కుటుంబాలతో ఫోన్లో లో మాట్లాడి ధైర్యం చెప్పారు. రూ.3.5 లక్షల అంచనా వ్యయంతో , ఆరు బాధిత కుటుంబాలకు ఒక గది, పంచ , వచ్చేలా షెల్టర్ నిర్మించి ఇచ్చేలా పనులు ప్రారంభించారు.

ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు నేడు ధర్నా

ప్రజాశక్తి-నరసరావుపేట

జిల్లాలోని సహకార సంఘాల ఉద్యోగులందరూ రాష్ట్ర సహకార ఉద్యోగుల జేఏసీ ఆధ్వ ర్యంలో సోమవారం గుంటూరు డిసిసిబి ఎదుట నిర్వహించ తలపెట్టిన ధర్నా జయప్రదం చేయాలని జిల్లా సహకారం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పొలిమేర వెంకట రెడ్డి పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా బ్యాంకు పరిధిలోని 167 సంఘాల సిబ్బంది ఈ ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు జీవో నెంబర్ 36 లో వెం టనే అమలుపరిచి ఉద్యోగుల హక్కులను జీవన స్థితిగతులను కాపాడాలని ఈ ధర్నా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని సహకార సంఘాల ఉద్యోగులందరూ ఉదయం 9 గంటలకే గుంటూరు పరిపాలన కార్యానికి చేరుకోవాలని సూచించారు.

జాతీయ బ్యాంకులో అకౌంట్ తప్పనిసరి

ప్రజాశక్తి - రెంటచింతల

జాతీయ ఉపకార వేతన పరీక్ష రాసి ఎంపికైన మెరిట్ విద్యార్థి తప్పనిసరిగా ఏదైనా జాతీయ బ్యాంకులో సేవింగ్స్ అకౌంట్ తీసుకొని తల్లిని, తండ్రిని జాయింట్ చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు కోరారు. విద్యార్థి ఆధార్ నెంబర్ మాత్రమే అకౌంట్ కు జత చేయాలన్నారు. సేవింగ్ అకౌంట్ లో కాకుండా వేరు ఎకౌంట్లు పనిచేయవు అన్నారు విద్యార్థి పేరు తండ్రి పేరు పుట్టిన తేదీ మెరిట్ కార్డు లో ఉన్న విధంగానే ఉండాలన్నారు.

గ్రామస్తులే నడుంబిగించారు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రోడ్డుపై ఏర్పడిన గుంతలను గ్రామస్తులే పూడ్చుకున్నారు. సత్తెనపల్లి మండలం గర్నెపూడి నుండి మేడికొండూరు మండలం శిరిపురం వరకు వున్న తారు రోడ్డు ధ్వంసమె.. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. సుమారు మూడేళ్లుగా ఈ రోడ్డు పరిస్థితి ఇదే విధంగా ఉంది. దీంతో, ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు అవస్థలు పడు తున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి దృష్టికి తీసుకెళ్ళిన పట్టించుకోలేదు. ప్రజాప్రతినిధులు అధి కారులు చుట్టూ తిరిగిన గ్రామస్తులు అలసిపోయారు. పాఠశాలలు తిరిగి ప్రారంభం కావడంతో విద్యార్థులు వెళ్ళేందుకు ఇబ్బంది పడుతున్నారు. గర్నెపూడి గ్రామస్తులు చందాలు వేసుకుని సుమారు రెండు కిలోమీటర్ల వరకు రోడ్డు పై ఏర్పడ్డ గుంతలను పొక్లెయిన్ సాయంతో పూడ్చారు.

పొక్లెయిన్‌తో గుంతలు పూడుస్తున్న గర్నెపూడి గ్రామస్తులు

ఎమ్మెల్యే అవినీతిని ఎండగట్టండి : టిడిపి

ప్రజాశక్తి-నరసరావుపేట

రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఐటిడిపి నాయకులు,కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. పట్టణంలో స్థానిక నవయుగ కన్వెన్షన్ లో ఆదివారం నాడు ఐటిడిపి నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న పార్టీ కార్యక్రమాలను సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేయడంలో ఐటిడిపి నాయకులు ఇంకా చురుగ్గా వ్యవహరించాలని సూచించారు. సోషల్ మీడియా వేదికగా స్థానిక ఎమ్మెల్యే అవినీతి,అక్రమాలను ఎండగట్టాలని దిశా నిర్దేశం చేశారు. రాబోయే ఎన్నికలను దృష్ట్యా ఐటీడీపీ నాయకులు పార్టీ కార్యక్రమాలను విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించాలని చెప్పారు. సమా వేశంలో రాష్ట్ర డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు,రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోట్ట కిరణ్, నరసరావుపేట మండల పార్టీ అధ్యక్షులు బండారుపల్లి విశ్వేశ్వరరావు,పట్టణ ప్రధాన కార్యదర్శి గూడూరు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిపి నాయకుల ఆత్మీయ సమావేశం

అమర్నాథ్ కుటుంబాన్ని ఆదుకోండి

ప్రజాశక్తి - వినుకొండ

అక్కను వేధిస్తున్నారని ప్రశ్నించిన అమర్నాథన్ అతి కిరాతకంగా పెట్రోల్ పోసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ వినుకొండ టిడిపి ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం టిడిపి నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, అయుబ్ ఖాన్, షమీంఖాన్, పల్లె మీసాల దాసయ్య తదితరులు మాట్లాడారు. నిందితులు అధికార పార్టీ అండతోనే ఇంతటి ఘోరానికి పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా లోపించాయని అన్నారు. అమర్నాథ్ ను హత్య చేసిన నిందితులను ఉరితీయాలని డిమాండ్ చేశారు.

'బీసీలకు రక్షణ లేకుండా పోయింది'

ప్రజాశక్తి-కారెంపూడి

వైసీపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో బీసీ లకు రక్షణ లేకుండా పోయిందని జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్ అన్నారు. బాపట్ల జిల్లా రాజోలు లో తన సోదరిని వేధిస్తున్న వాళ్ళను అడ్డుకున్న పదవ తరగతి చదివే అమరనాథ్ గౌడ్ అనే యువకుడిని గంజాయి మత్తులో వైసీపీ కార్యకర్తలు కాళ్ళు చేతులు కట్టి పెట్రోలు పోసి సజీవ దహనం చేయడం, నెల్లూరు జిల్లా సూళ్లురుపేట నియోజకవర్గం లో టీడీపీ కార్యకర్త యాదవ సామాజికవర్గానికి చెందిన నాయకుడి పైన వైసీపీ గుండాలు దాడి చేయడం నిదర్శనం అని అన్నారు. మాచర్ల నియోజకవర్గంలో కూడా వైసీపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక 5 గురు బీసీ నాయకులను అతి కిరాతకంగా చంపిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు టీడీపీ ప్రభుత్వం అధికారం లోకి రాగానే బీసీ రక్షణ చట్టం అమలు చేసి రక్షణ కల్పిస్తుందని అన్నారు.

అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలం: టిడిపి

ప్రజాశక్తి-పెదకూరపాడు

అన్ని రంగాల్లో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని పెదకూర నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్ విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మత్తు పదార్థాలు విక్రయాన్ని ప్రభుత్వమే ప్రోత్సహిస్తున్నట్లు ఉంది అన్నారు. పేదలపై బలహీనవర్గాలపై దాడులు పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పేదలను భయభ్రాంతులకు గురి చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉందన్నారు. పేదల పేరుతో వైసీపీ ప్రభుత్వం దోపిడీకి పాల్పడుతుందన్నారు. పాలించే అర్హత ప్రభుత్వానికి లేదన్నారు. నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కూడా పూర్తిగా విఫలమైందన్నారు.

లింగాపురం నుంచి జోడో పాదయాత్ర

ప్రజాశక్తి-అమరావతి

పల్నాడు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా గోపి ఆధ్వర్యంలో లింగాపురం నుండి పెదకూరపాడు వరకు ఆదివారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు చేసిన పాదయాత్రను స్ఫూర్తిగా తీసుకొని ఈ పాదయాత్రను చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కొండెక్కిన చికెన్ ధరలతో దుకాణాలు వెలవెల!

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

చికెన్ ధరలు పెరగటంతో చికెన్ దుకాణాలు కొనుగోలుదారులు లేక వెలవెల పోతున్నాయి.ఆదివారం వచ్చిందంటే మాంసం ప్రియులతో రద్దీగా ఉండే చికెన్ దుకా ణాలు వెలవెల పోతున్నాయి. కేజీ చికెన్ రూ.300 పలుకుతోంది. వేసవిలో కోళ్ళ ఉత్పత్తి గణనీయంగా తగ్గడంతో ధరలు పెరిగాయని దుకాణ యజమానులు చెబుతున్నారు.కేజీ చికెన్ రూ.200 ఉన్నప్పుడు ఒక్కొక్క దుకాణదారుడు రోజుకూ 500 కేజీలు విక్రయించేవారని, ప్రస్తుతం 10 కేజీలు కూడా అమ్మడం లేదని చికెన్ స్టాల్స్ యజమానులు వాపోతున్నారు. చికెన్ ధర కన్నా చేపలు ధర తక్కువగా వుండటంతో, మాంసం ప్రియులు వాటిని కొనుగోలు చేస్తున్నారు. సత్తెనపల్లిలో సుమారు 50 వరకు చికెన్ స్టాల్స్ ఉన్నాయి. చికెన్ ధరలు పెరగడంతో ఆదాయం తగ్గిందని, కరెంట్ బిల్లు లు కూడా కట్టే పరిస్థితి లేదని వాపోతున్నారు.

పాడి రైతులకు బీమాతో ఉపయోగం

ప్రజాశక్తి -రెంటచింతల

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన వైయస్సార్ పశు బీమా పథకాన్ని పాడి రైతులు సద్వినియోగపరుచుకోవాలని పశు వైద్యాధికారి డాక్టర్ బషీర్ కోరారు. ఆదివారం పలువురు పాడి రైతులతో మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డు ఉన్న రైతులు బీమా సొమ్ములో 20 శాతం రైతు తన వాటాగా చెల్లించాలని, కార్డు లేని వారు 50 శాతం చెల్లించాలన్నారు. సంకరజాతి పాడిపశువులకు రూ.30,000 దేశ వాలి పశువులకురూ.15,000 గొర్రెలు, మేకలకు రూ. 6,000 ప్రభుత్వం భీమా సౌకర్యం కల్పించిందన్నారు ఏ కారణం చేతనైనా పశువు మరణిస్తే పాడి రైతుకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందన్నారు ఈ విషయాన్ని రైతులు గమనించాలని డాక్టర్ బషీర్ కోరారు

20న మహా ధర్నాను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

కార్మికుల పట్ల ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 20న విజయవాడలో జరగనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి మిద్దెపోగు బాబురావు కోరారు. ఆదివారం వీపీసౌత్ లోని పలు కార్మిక సంఘ నాయకులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి పాటుపడాల్సిన ప్రభుత్వాలు, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ కార్మిక వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ప్రత్యేక చట్టాలను రూపొందించి కార్మిక వ్యవస్థను బలపరచాల్సిన ప్రభుత్వాలు ఆ దిశలో కనిపించడం లేదన్నారు.

తాగునీటి సమస్యకు త్వరలో పరిష్కారం

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలో వీలైనంత త్వరగా తాగునీటి సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం తెనాలి రోడ్‌లోని పంపిణీ స్కీంను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. గుంటూరు ఛానల్లో తాగునీటి లెవల్ తగ్గడంతో ఈ సమస్యకు వచ్చిందని, గుంటూరు కెనాల్ నుండి తీసుకోవడానికి గుంటూరు కార్పొరేషన్ అధికారులతోనూ, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎంటిఎంసి ఇంజినీర్ ఎస్‌వి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని మెల్లంపూడి నుండి నూతక్కి వరకు సుమారు రెండున్నర కిలోమీటర్ల పొడవుతో రూ.2.20 కోట్లతో నిర్మించిన తారు రోడ్డును ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆదివారం పరిశీలించారు. ఆయనవెంట వైసిపి గ్రామ అధ్యక్షులు బి.రాజారామిరెడ్డి, మున్సిపల్ ఏఈ కృష్ణారెడ్డి ఉన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

పెనుమాకలో జరుగుతున్న తారురోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పెనుమాక వైఎస్సార్ సెంటర్ నుంచి లంక పొలం డొంకరోడ్డు రూ.90 లక్షలతో, పొలిమేర డొంక రూ.కోటితో నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించి పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిఇ కృష్ణారెడ్డి, రామేశ్వరరెడ్డి, కిరణ్, ఎఇ పాల్గొన్నారు.

పొనుగుపాడులో ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలంలోని పొనుగుపాడులో డాక్టర్ మర్రి పెద్దయ్య ఆధ్వర్యంలో డాక్టర్ ఎంవి రెడ్డి హాస్పిటల్ నరసరావుపేటలోని ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ ఎం వివేకానందరెడ్డి ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం జరిగింది. 154 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 65 మందికి కంటి శుక్లములు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. రెండ్రోజుల్లో ఆపరేషన్లు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎం.రమేష్, పి.చంద్రమౌళి, కె.అశోక్, శ్యామ్‌సుందర్, వి.కోటి లింగయ్య, ఎస్.రాము, కనకం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

పరామర్శకు వెళ్లిన నాయకుల అరెస్టు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఏలూరులో యాసిడ్ దాడిలో గాయపడి మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యడ్ల ఫ్రాన్సికను తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షులు వంగలపూడి అనిత పరామర్శించారు. ఫ్రాన్సికకు అందుతున్న వైద్యం గురించి ఆరా తీశారు. బాధితురాలికి ప్రభుత్వం ఉద్యోగంతో పాటు సొంత ఇల్లు రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. ప్రతిరోజూ రాష్ట్రంలో ఏదో మూల ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇటువంటి ఘటనలని విమర్శించారు. మొదట పరామర్శకు వెళ్తున్న టిడిపి మహిళా నేతలు పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు, మహిళలకు వాగ్వివాదం జరిగింది. ఈ సందర్భంగా మహిలా నేతలను అరెస్టు చేసి దుగ్గిరాల స్టేషన్‌కు తరలించి ఆపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంఓల కృష్ణవందన, కుసుమ, పుష్పలత, ఊర్మిల, ఉదయశ్రీ, కె.శైలజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి దుగ్గిరాల

జగన్ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని తెలుగుదేశం పార్టీ మహిళా నాయకులు ఆరోపించారు. ఏలూరులో నాలుగు రోజుల క్రితం యాసిడ్ దాడికి గురైన చికిత్స పొందుతున్న మహిళను పరామర్శించేందుకు తాడేపల్లి మణిపాల్ ఆసుపత్రికి వెళ్లిన తెలుగు మహిళలను పోలీసులు అరెస్టు చేసి ఆదివారం దుగ్గిరాల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల మీద దాడికి కారణం గంజాయి అని రాష్ట్రం గంజాయి విక్రయాల్లో అగ్రస్థానంలో ఉన్నదని విమర్శించారు. జగన్ పాలనలో మహిళలకు రక్షణ కరువైంది గౌరవం లేకుండా పోయిందని వాపోయారు. బాధితురాలి కుటుంబానికి రూ.10 లక్షలు ఇస్తామని ప్రకటించిన జగన్ ప్రభుత్వం రూ.లక్ష ఇచ్చి పది లక్షలు ఇచ్చామని చెప్పమన్నారు అని విమర్శించారు. బాధితురాలికీ ఏమైనా జరిగితే జగన్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళ అధ్యక్షులు షేక్ అషా ఏలూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి విజయలక్ష్మి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయ సత్య ఎన్టీఆర్ జిల్లా నాయకులు దాసరి ఉదయ్‌శ్రీ, తాడేపల్లి అధ్యక్షులు అన్నే కుసుమ, దుగ్గిరాల మండల అధ్యక్షులు కేశంనేని అనిత, వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు, ఉన్నం ఝాన్సీ పాల్గొన్నారు.

నరుడికి భగవద్గీత నారాయణరెడ్డి కవిత్వం

రామచంద్రరావును సన్మానిస్తున్న కవులు, సాహితీవేత్తలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రముఖ కవి నారాయణరెడ్డి కవిత్వం నరుడికి భగవద్గీత అని ప్రముఖ కవి, సాహిత్య విమర్శకులు డాక్టర్ రావి రంగారావు అన్నారు. అమరావతి సాహితీ మిత్రులు ఆదివారం ఉదయం గుంటూరు బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో నిర్వహించిన సాహిత్య సభలో ఆయన నారాయణరెడ్డి కవిత్వం గురించి ప్రసంగించారు. ఎంతో కష్టపడి సమున్నత స్థానాలకు ఎదిగిన కవి అని కొనియాడారు. ఆరవ తరగతిలోనే పాటతో రచనలు ప్రారంభించారని, క్రమంగా పద్యాలు, గేయాలు, వచన కవితలు రాశారని వివరించారు. ఆధునికాంధ్ర కవిత్వం గురించి నారాయణ రెడ్డి సమర్పించిన పరిశోధనా గ్రంథం, ఆయన రాసిన జన రంజక చిత్ర గీతాలు ఈ నాటికీ ఏ నాటికీ అందరూ చదివి తీరవలసినవని సూచించారు. నారాయణ రెడ్డి కవిత్వం లాగానే ఆయన వ్యక్తిత్వం కూడా ఎంతో సమున్నతమైనదని చెప్పారు. ప్రముఖ సోషలిస్ట్ నాయకులు, రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యులు మోదుగుల పాపిరెడ్డి అధ్యక్షత వహించిన సభలో, ప్రముఖ రచయిత చిలకమర్తి లక్ష్మీ నరసింహం పంతులు సాహితీ ప్రస్థానం గురించి డాక్టర్ ఎన్. సిహెచ్.సుధా మైథిలి ప్రసంగించారు. మంగళగిరికి చెందిన కౌతరపు రామచంద్రరావు ఈమాసం కవిగా స్వీయ గేయాలను ఆలపించారు. కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ పింగళి భాగ్యలక్ష్మి, కౌతరపు కవిత, యక్కంటి పద్మావతి, గోలి హనుమచ్ఛాస్త్రి, డాక్టర్ సేవాకుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రామచంద్రరావును సత్కరించారు.

373 మందికి కంటి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

పెదనందిపాడు ప్రాంత అభివృద్ధికి చేయూతతోపాటు ప్రజలకు ముఖ్యమైన అవసరాలు తీర్చడమే తన లక్ష్యమని నాట్స్ అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరిబాబు (బాపు) అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన పెదనందిపాడులోని పిఎఎస్ కాలేజీలో నాట్స్ సహకారంతో ఏర్పాటు ఉచిత మెగా కంటి వైద్య చికిత్స శిబిరాన్ని విశ్రాంత ఐజి రవిచంద్ర, కళాశాల అధ్యక్షులు, మాజీ ఎంపిపి నర్రా బాలకృష్ణ తో కలసి ప్రారంభించారు బాపు మిత్రమండలి సంఘ అధ్యక్షులు కాకుమాను నాగేశ్వరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శంకర కంటి ఆసుపత్రి డాక్టర్లు సంకల్ప, మెహబూబ్, సోనాలిలు 373 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 215 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరమని నిర్ణయించారు. వీరికి విడతల వారీగా పెదకాకాని శంకర కంటి ఆసుపత్రికి తరలించేందుకు కళాశాల యజమాన్యం తమ బస్సులను ఉపయోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీరరాఘవయ్య, ఎన్సీసీ అధికారి డాక్టర్ పాతూరి శ్రీనివాసరావు, కె.హరిబాబు, మాజీ ఎంపిపి నగరాజుకుమారి, ఎం.రాఘవయ్య, సుబ్బారావు, రమేషు, శివప్రసాద్, బాషా, అంకారావు, రాజాబాబు పాల్గొన్నారు.ఔ

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-తెనాలి

ఇంటర్, డిగ్రీలో సత్తా చాటిన ఆర్యవైశ్య విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పట్టణానికి చెందిన శ్రీ కన్యకాపరమేశ్వరి వైశ్య విద్యానిధి కమిటీ కార్యదర్శి పి.వెంకటావ్ ఆదివారం తెలిపారు. 2022-23 విద్యాసంవత్సరంలో ఇంటర్‌లో 925కు పైబడి, డిగ్రీలో 80 శాతం మార్కులకు పైబడి మార్కులతో ఉత్తీర్ణత పొందినవారు దరఖాస్తుకు అర్హులన్నారు. అభ్యర్థులు తమ మార్కుల జాబితా, ఆధార్ జిరాక్స్‌లతో ఈనెల 30లోగా బస్టాండ్ సమీపంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య విద్యానిధి కార్యదర్శికి చేర్చాలని సూచించారు. ఎంపికైన ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తామని, ఇతర వివరాలకు 9440258574 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - తెనాలి

ఆటో డ్రైవర్లు విధిగా నిబంధనలు పాటించాలని రూరల్ ఎస్సై సిహెచ్ వెంకటేశ్వర్లు చెప్పారు. ఆదివారం ఆయన రూరల్ పరిధిలో ఆటోలను తనిఖీ చేసి నిబంధనలు పాటించని కొందరికి అపరాధ రుసుం విధించారు. డ్రైవర్లు యూనిఫామ్ ధరించాలని, వాహనాల ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారే ఆటో నడపాలని చెప్పారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు గురైనప్పుడు డ్రైవింగ్ లైసెన్స్ లేనిదే బాధితులకు ఇన్సూరెన్స్ సంబంధిత న్యాయం జరగదన్నారు. ఇన్సూరెన్స్ కూడా ఫోర్సులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కేవలం మేజర్లు మాత్రమే ఆటో నడపాలన్నారు. ఇటీవల కాలంలో నమోదైన కొన్ని సంఘటనల దష్ట్యా ఆటోలపై ప్రత్యేకంగా దృష్టి సారించి తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని, అవసరమైతే ఆర్టీవో వద్ద హాజరు పరిచి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మానసిక ఆరోగ్యంతోనే ఉత్తమ సమాజం

మాట్లాడుతున్న డాక్టర్ సురేష్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు

వ్యక్తుల సంపూర్ణ మానసిక ఆరోగ్యంతో ఉన్నపుడే పరిణతి కలిగిన సమాజం సాకారం అవుతుందని అందుకోసం స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రభుత్వాలు ప్రజలతో కలిసి ఉమ్మడి కార్యాచరణతో పనిచేయాలని కాటూరి మెడికల్ కాలేజి మానసిక వైద్య విభాగాధిపతి డాక్టర్ కె.సురేష్‌కుమార్ అన్నారు. ఆదివారం అవగాహన ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 45 కోట్ల మంది, భారత దేశ జనాభాలో 7.5 శాతం మంది వెంటనే చికిత్స అవసరమైన మానసిక ఆరోగ్య సమస్యలతో సతమతం అవుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ అధికారికంగా ప్రకటించిందన్నారు. ఇండియాలో 13 నుంచి 17 ఏళ్ల బాలల్లో 7.3 శాతం మానసిక ఆందోళన, ఒత్తిడి, మాదక ద్రవ్యాల వినయోగం, ఆత్మహత్య ఆలోచనతో బాధపడుతున్నారని తెలిపారు. మానసిక సమస్యలు ఉన్నట్లు బయటికి చెబితే సమాజం చులకన చేస్తున్న భయంతో ఈ లక్షణాలను చెప్పుకోవటానికి చాలా మంది జంకుతున్నారని అన్నారు. స్మార్ట్ ఫోన్లకు అలవాటు పడుతున్న చిన్నారులు, నిద్రలేమితో సతమతం అవుతున్న యువకులు చదువుకు, కుటుంబ సభ్యులకు తగిన సమయాన్ని వెచ్చించలేక కుంగుబాటుకు గురవుతున్నారని, వ్యాయామం లేకపోవటం కూడా మానసిక ఆరోగ్యాన్ని కోల్పోవటానికి ఒక కారణమన్నారు. వివేక వంతంగా ఆలోచిస్తూ విచక్షణతో తగు ఆహారం తీసుకోవటం, వ్యాయామం చేయటం, సరిపోయేంత నిద్రపోవటం, మత్తుపానీయాలు, పొగాకు వాడటానికి దూరంగా ఉండటం, వైద్య చికిత్స నియమాలను జాగ్రత్తగా పాటించటం ద్వారా మానసిక సమస్యలను అధిగమించవచ్చన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్‌కుమార్‌ను అవగాహన సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సాయిరాం, రాజన్న, ఎ.వి.రామారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రసాద్

ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దు

యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు

నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైందని, ఈ ఏడాదైనా ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచే విధంగా అధికారులు వ్యవహరించాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడారు. ఉపాధ్యాయుల మనోభావాలు దెబ్బతీసేలా, సమాజంలో ఉపాధ్యాయులను చులకన భావంతో చూసేలా అధికారులు వ్యవహరించటం విద్యారంగానికి, సమాజానికి మంచిది కాదన్నారు. 11వ పిఆర్‌సి, డిఎ, హెచ్‌ఆర్ఎ పరంగా ప్రభుత్వ ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగిందని, కనీసం 12వ పిఆర్‌సిలోనైనా అన్యాయం సరిచేయాలని కోరారు. ఒపిఎస్ ఇస్తామని జిపిఎస్‌ను ప్రతిపాదించటాన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. చిన్నచిన్న కారణాలతో ఉపాధ్యాయుల్ని సస్పెండ్ చేయటం, తల్లిదండ్రుల ముందు ఉపాధ్యాయుల్ని దోషులుగా చిత్రీకరించటం మానుకోవాలని హితవు పలికారు. ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకుంటే అన్ని సంఘాలనూ కలుపుకొని ఉద్యమిస్తామని హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ బదిలీలు, ప్రమోషన్లలో ప్రభుత్వ అస్పష్టత వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షులు పి.వి.శ్రీనివాసరావు, జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఎఎల్ శివపార్వతి, కోశాధికారి ఎమ్‌డి.దౌలా పాల్గొన్నారు.

రక్తదానం శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎసిఎల్, సిఐటియు నాయకులు

సిఐటియు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచ రక్తదాన దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం పాత గుంటూరులోని సిఐటియు కార్యాలయంలో లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సుభాని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి మాట్లాడుతూ సిఐటియు ఆర్థిక పోరాటాలే కాకుండా సామాజిక, ఆరోగ్యపరమైన అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. కరోనా సమయంలోనూ, ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే స్పందించి రక్తదానం చేయడంలో సిఐటియు ముందుం టుందని తెలిపారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ మాట్లాడుతూ సిఐటియు చేస్తున్న కృషి అభినందనీయమని, భవిష్యత్తులో దీన్ని కొనసాగించాలని అన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఒకరు రక్తదానం చేయటం వల్ల ముగ్గురు ప్రాణాలు కాపాడుకోవచ్చని తెలిపారు. రక్తదానంపై ఉన్న అపోహను తొలగించేందుకు సిఐటియు కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమానికి సిఐటియు నగర కార్యదర్శి ముత్యాల అధ్యక్షత వహించగా లైన్స్ క్లబ్ గవర్నర్ గోపీచంద్, బ్లడ్ బ్యాంక్ ఇన్చార్జ్ రాజా తదితరులు మాట్లాడారు. శిబిరంలో 30 మంది రక్తదానం చేశారు.

పాల ఉత్పత్తి పెంపుదలే లక్ష్యం

- అందుబాటులో గొంతువాపు టీకాలు, నట్టల మందు
- వైఎస్సార్ పశు బీమాకు పాడిరైతుల నుండి విశేష స్పందన
- ప్రజాశక్తితో పల్నాడు జిల్లా పశు సంవర్థక శాఖాధికారి కె.కాంతారావు

పాల ఉత్పత్తి పెంపుదలకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు పల్నాడు జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి కె.కాంతారావు తెలిపారు. పాడి పశువుల ఆరోగ్యానికి ప్రాధాన్యత, పశు భీమా పథకాలతో పశు పోషకుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పశు సంవర్ధక శాఖ పని చేస్తోందని అన్నారు. పశు పోషకులు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తగిన తోడ్పాటును ఇస్తుందన్న ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

పాల ఉత్పత్తిని ఏ విధంగా పెంచబోతున్నారు?

వ్యవసాయ రంగానికి ప్రధాన అనుబంధ రంగమైన పాడి పరిశ్రమ అభివృద్ధికి పశు సంవర్ధక కృషి చేస్తోంది. పశు బీమా, దేశీయ ఆవుల యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సమర్థవంతమైన పశు వైద్య సేవలు అందించి పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తున్నాం. ఐదుగురు రైతులు కలిసి ఒక గ్రూపుగా ఏర్పడితే వారిని ఒక యూనిట్ కింద ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. మొత్తం యూనిట్ విలువ రూ.30 లక్షలు కాగా రైతు వాటా 10 శాతం గ్రూపునకు రూ.3 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో రూ.9 లక్షలు షెడ్ నిర్మాణానికి కాగా గ్రాసం పెంపకానికి నిధులిస్తాం.

లంపిస్కిన్ వ్యాధి తీవ్రత ఎలా ఉంది? పశువులేమైనా మృతి చెందాయా?

మరణాలేమీ లేవు. ఈ వ్యాధి పధానంగా ఆవులకు మాత్రమే సోకుతుంది. పల్నాడు జిల్లాలో మొట్టమొదటి లంపిస్కిన్ కేసు అమరావతి మండలం అత్తలూరులో గుర్తించాం. పశువు నుండి శాంపిల్ సేకరించి పరీక్షలు చేయగా లంపిస్కిన్ వ్యాధిగా నిర్ధారణైంది. వెంటనే చికిత్స ప్రారంభించాం. టీకాలు కావాలని ప్రభుత్వానికి నివేదించగా సరైన సమయానికి 80 వేలు టీకాలు వచ్చాయి. వెంటనే వాటిని పశువులకు వేయించాం. మరణాలేమీ సంభవించలేదు.

వర్షాకాలంలో పశువులకు సోకే వ్యాధులు, మందులు అందుబాటు?

వర్షాకాలంలో పశువులకు గొంతువాపు వ్యాధి సోకే అవకాశం ఉంది. ఇప్పటికే గొంతు వాపు వ్యాధి టీకాలను పశు వైద్యశాలకు పంపించి టీకాలు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని పశు వైద్యులకు ఆదేశించాం. 3 నెలలు వయసు నిండిన లేగ దూడల దగ్గర నుండి నాలుగేళ్ల వయసులోపు పశువులకు గొంతు వాపు వ్యాధి నివారణకు టీకాలిస్తాం. పశువులకు సాధారణ వ్యాధుల దగ్గర నుండి అన్ని రకాల వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయి.

వైద్యుల కొరత ఉందా?

పల్నాడు జిల్లాలో 64 పశు వైద్యశాలలు ఉండగా 57 ఆస్పత్రుల్లో వైద్యులు సేవలు అందిస్తున్నారు. 7 పశు వైద్య శాలల్లో వైద్యులు లేకపోయినా దగ్గరలో ఉన్న పశు వైద్యుల ద్వారా పశువులకు చికిత్స అందుతున్నాయి.

పశువుల బీమా వర్తింపచేస్తున్నారా?

ప్రభుత్వం నూతనంగా వైఎస్ఆర్ పశు బీమా పథకం పట్ల పశు పోషకుల నుండి విశేష స్పందన లభిస్తుంది. పల్నాడు జిల్లాలో క్లష్టర్ల వారి కేటాయింపులలో భాగంగా నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ నమోదు చేస్తుంది. మేలు జాతి పశువుకు రూ.30 వేలు నుండి రూ.1.20 లక్షల వరకు బీమా వస్తుంది. నాటు పశువుకు రూ.15 వేలు, 6 నెలలు ఆపై వయసు పైబడిన గొర్రెలకు, మేకలకు, పందులకు రూ.6 వేలు వర్తిస్తుంది. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న వారికి 100 శాతం బీమా చెల్లించాం. 330 పశువులకు నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంటుంది.

పచ్చి గడ్డి కొరత ఎలా అధిగమిస్తున్నారు?

పశు గ్రాసాల కొరతను అధిగమించేందుకు పోషక విలువలు కలిగిన టి.ఎం.ఆర్‌ను 60 శాతం ప్రభుత్వ రాయితీ పోను కిలో రూ.6.50కు సరఫరా చేస్తుంది. కావాల్సిన వారు రైతు భరోసా కేంద్రంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది ద్వారా కొనుగోలు చేయవచ్చు. 600 మెట్రిక్ టన్నుల టి.ఎం.ఆర్ అందుబాటులో ఉంది. ఒక్కో రైతుకు గరిష్టంగా 2 టన్నుల వరకు పంపిణీ చేసేలా ప్రణాళికలు రూపొందించాం.

మేకలు గొర్రెలు సంరక్షణకు తీసుకున్న చర్యలు?

ఈ నెల 15 నుండి 30వ తేదీ వరకు మేకలు గొర్రెలకు నట్టల నివారణకు మందు తాగిస్తాం. దీనిపై ముందురోజే గొర్రెలు మేకల పెంపకం దారులకు తెలియజేస్తాం. నట్టల మందు అందిస్తాం.

జగనన్న పాల వెల్లువ కింద పాల సేకరణ?

అమూల్ డైరీ రోజుకు జిల్లాలో 20 వేల లీటర్ల పాల సేకరణ జరుగుతుంది. ప్రభుత్వ లక్ష్యం మేరకు సేకరణ పెంచడంపై దష్టి సారిస్తున్నాం.

ప్రజాశక్తి - నరసరావుపేట

జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

ఎం.ఆదిత్య, బి.లోకేష్‌రెడ్డి, ఎస్.వెంకటశైలజ

జెఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు అన్ని కేటగిరీల్లో కలిపి ఉత్తమ ర్యాంకులు సాధించారని అకడమిక్ డైరెక్టర్ బొప్పన సుష్మ తెలిపారు. మొగిలి ఆదిత్య 58వ ర్యాంకు, బొల్లా లోకేష్‌రెడ్డి 87వ ర్యాంకు, సూర వెంకటశైలజ 216వ ర్యాంకు, బజారు చక్రధర్ 340వ ర్యాంకు, రెగిడి దినేష్ 420వ ర్యాంకు, దేవర నిక్షిప్త 450వ ర్యాంకు, మహంకాళి మురారి 633వ ర్యాంకులతోపాటు వెయ్యిలోపు 16, రెండువేలలోపు 28, ఐదువేల లోపు 57, పది వేలలోపు 100కుపైగా ర్యాంకులు సాధించారన్నారు. ర్యాంకర్లను సుష్మ, ఎగ్జిక్యూటివ్ ఎజిఎం ఈ దుర్గాప్రసాద్, డీన్స్ కిషోర్, చంద్రశేఖర్, కృష్ణ ప్రిన్సిపాల్ బాలసుబ్రహ్మణ్యం అభినందించారు.

జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో నారాయణ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జెఇఇ అడ్వాన్స్‌డ్ -2023 పోటీ పరీక్షా ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు నారాయణ విద్యా సంస్థల విద్యార్థులు తమ ప్రతిభ కనబర్చారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని నారాయణ సంస్థల కార్యాలయంలో ఆదివారం జరిగిన విద్యార్థుల అభినందన సభలో విజేతలకు కోర్ డీన్ వీరగంధం శ్రీనివాసరావు, డీన్ వల్లభరావు శుభాకాంక్షలు తెలిపారు. వరసగా వెయ్యిలోపు నలుగురు ర్యాంకులు సాధించారు. వీరిలో జె.నితిన్ 232 ర్యాంకు, ఆదిల్ ఆలీ మహ్మద్ 334 ర్యాంకు, ఎం.చిరంజీవి 822ర్యాంకు, జి.ఓంకార్ 837 ర్యాంకులు సాధించారని చెప్పారు. 2 వేల లోపు ఆరుగురు, 5 వేల లోపు 16 తమ ప్రతిభను చాటుకున్నారు. సంబంధిత విజేతలు, వారి తల్లిదండ్రులను డీన్ కోటేశ్వరరావు, ఎజిఎం హనుమంతరావు, ప్రిన్సిపల్స్ సిహెచ్.శ్రీనివాస్, జి.శ్రీనివాస్, రమాదేవి అభినందించారు.

కొండవీడుకోటకు ఆరు రాష్ట్రాల ఎన్‌సిసి క్యాడెట్లు

ప్రజాశక్తి - యడ్లపాడు : చారిత్రక ప్రాంతమైన కొండవీడుకోటను ఆదివారం ఉదయం ఐదు రాష్ట్రాలకు చెందిన ఎన్‌సిసి క్యాడెట్ల బృందాలు సందర్శించాయి. 'ఏక్తా భారత్ శ్రేష్ఠ భారత్' కార్యక్రమంలో భాగంగా పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, చండీగఢ్, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 600 మంది క్యాడెట్లు సందర్శనకు వచ్చారు. పర్యావరణ పరిరక్షణపై సదస్సు నిర్వహించగా 25 ఏపీ బెటాలియన్ నుంచి ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ చంద్రశేఖర్, కమాండింగ్ ఆఫీసర్ సిద్ధూ, పల్నాడు జిల్లా డీఎఫ్‌వో ఎన్.రామచంద్రరావు, కొండవీడు అభివృద్ధి కమిటీ కన్వీనర్ కె.శివారెడ్డి పాల్గొని క్యాడెట్లకు పలు అంశాలను వివరించారు. అనంతరం ట్రెక్కింగ్‌తో పలు విభాగాల్లో పోటీలు నిర్వహించారు.